

అమలాపురంలో భువనేశ్వరిని కలుసుకున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే ఆనందరావు



భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి హరీష్‌మాధుర్, జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి

భువనేశ్వరికి అపూర్వ స్వాగతం

సత్యనారాయణ గార్డెన్స్‌లో బస

అమలాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'నిజం గెలవాలి' పేరిట పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి బుధవారం సాయంత్రం అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌కు చేరుకున్నారు. ఆమెకు టీడీపీ జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. గురువారం కోనసీమ జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి చంద్రబాబు అరెస్టు సమయంలో మరణించిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తారు. అయినవిల్లి, ఉప్పలగుప్తం, అల్లవరం, రాజోలు, మలికిపురం, మండపేట, అనపర్తిల్లో ఆమె పర్యటన జరపనున్నారు. భువనేశ్వరికి టీడీపీ అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, చెల్లి వివేకానంద, టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు, అల్లాడ స్వామినాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, టీడీపీ నాయకులు డాక్టర్ సత్యశ్రీ, పెచ్చెట్టి చంద్రమౌళి, జ్యోతుల నవీన్, చెరుకూరి సాయిరామ్‌తో పాటు పలువురు నేతలు, మహిళా కార్యకర్తలు భువనేశ్వరిని కలిసి స్వాగతం పలికారు. గురువారం ఆమె ఉప్పలగుప్తం మండలం చల్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త సలాది విశ్వనాథం కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేస్తారు. అల్లవరం మండలం రెల్లుగడ్డలో టీడీపీ సీనియర్ నాయకుడు నడింపల్లి పుల్లంరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు.

ఓదార్చి.. అభయమిచ్చి..

- చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనోవేదనకు గురై మరణించిన టీడీపీ అభిమానుల కుటుంబాలకు భువనేశ్వరి ఓదార్పు
- అధైర్యపడొద్దని... అండగా ఉంటామంటూ భరోసా
- పార్టీ కార్యకర్తలు తమ కుటుంబ సభ్యులని గుర్తుచేసిన భువనేశ్వరి
- వారికి ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ
- జగ్గంపేట, పెద్దాపురం, తుని, కాకినాడలలో నాలుగు కుటుంబాలకు పరామర్శ
- ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేత
- నిజం గెలవాలి కార్యక్రమానికి వచ్చిన భువనేశ్వరికి మహిళల సంఘీభావం

తమ కుటుంబం కష్టంలో ఉన్నప్పుడు ఆవేదనతో చలించిన ప్రతి కుటుంబానికీ రుణపడి ఉన్నామని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిజం గెలవాలి మూడు రోజుల పర్యటనలో భాగంగా భువనేశ్వరి బుధవారం కాకినాడ జిల్లాలో పర్యటించారు. స్కిల్ కేసులో చంద్రబాబు అక్రమ అరెస్ట్‌తో మనోవేదనకు గురై మృతి చెందిన నలుగురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి ఓదార్చారు. ఇంటిపెద్దను కోల్పోయిన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్తలు తమ కుటుంబం సభ్యులు వంటివారని, అలాంటి కుటుంబాలు ఆవేదనలో ఉంటే ఓదార్చడం తమ బాధ్యత అని వివరించారు. ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉండాలని కోరారు. తొలిరోజు కాకినాడ జిల్లా పర్యటన ముగించుకున్న భువనేశ్వరి బుధవారం రాత్రి బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చేరుకున్నారు.



కాకినాడలో సత్యవతి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి



ఎర్రకోనేరులో బాధిత కుటుంబానికి రూ.3 లక్షల చెక్కు ఇస్తున్న దృశ్యం

కాకినాడలో సత్యవతి కుటుంబాన్ని ఓదార్చిన భువనేశ్వరి

కాకినాడ సిటీ, జనవరి 24: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైలులో నిర్బంధించిన సమయంలో వేదనకు గురై మరణించిన నగర తెలుగు మహిళాధ్యక్షురాలు చిక్కాల సత్యవతి కుటుంబాన్ని నిజం గెలవాలి.. కార్యక్రమంలో భాగంగా బుధవారం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పరామర్శించారు. కాకినాడ సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో సత్యవతి నివాసానికి విచ్చేసి కుటుంబసభ్యులను ఓదార్చారు. భువనేశ్వరిని చూసి ఆమె కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. సత్యవతి కుటుంబానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రూ.3 లక్షల చెక్కు ఆర్థిక సాయంగా భువనేశ్వరి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, మాజీ మేయర్ సుంకర పావని, నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నేతలు పేరాబత్తుల రాజశేఖర్, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, ఎంఏ తాజుద్దీన్, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గుత్తుల రమణ, వాసిరెడ్డి చిట్టిబాబు, ఎండీ అన్సర్, తుమ్మల సునీత, మల్లిపూడి నాగదీపిక, గుజ్జు దుర్గ పాల్గొన్నారు.

తునిలో నూకరాజు కుటుంబానికి పరామర్శ

తుని రూరల్, జనవరి 24: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మన స్తాపంతో మృతి చెందిన ఎర్రకోనేరు గ్రామానికి చెందిన ఇసరపు నూకరాజు కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించారు. ఆమె తేటగుంట శివారు ఎర్రకోనేరు చేరుకుని మృతి చెందిన నూకరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్యపడవద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆ కుటుంబానికి రూ.3 లక్షలు ఆర్థిక సహాయంగా చెక్కును అందజేశారు. ఆమె వెంట టీడీపీ తుని నియోజకవర్గ ఇన్‌చార్జి యనమల దివ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, జ్యోతుల నవీన్, ఎస్వీఎస్ఎన్ వర్మ, యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, మోతుకూరి వెంకటేష్, బిక్కిన శ్రీనివాసరావు, చింతమనీడి నాగ సోమరాజు అబ్బాయి, గొల్లపల్లి రాంబాబు తదితరులు ఉన్నారు.



వీరబాబు చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భువనేశ్వరి



సుబ్బారావు భార్య చెల్లాయమ్మకు రూ.3 లక్షల చెక్కు అందిస్తున్న దృశ్యం



కాకినాడలో పర్యటిస్తున్న చంద్రబాబు సతీమణి భువనేశ్వరితో కరచాలనం చేస్తున్న మహిళలు

ఎట్టకేలకు దిగొచ్చారు

- బాట చార్జీలు లేకుండానే లోడింగ్
- ప్రారంభమైన ఇసుక ర్యాంపులు

ఆలమూరు, జనవరి 24: జిల్లాలో నాలుగు రోజుల కిందట ఇసుక ర్యాంపులను ప్రారంభించారు. మునుపెన్నడూ లేని విధంగా అడ్డగోలుగా బాటచార్జీలు వసూలు చేయడానికి నిర్వాహకులు ప్రణాళిక రూపొందించారు. ఇసుక సీనరేజీ కాకుండా రూ.500 నుంచి రూ.2వేల వరకు వసూలుకు రంగం సిద్ధం చేశారు. అయితే వాహనదారులు బాట బాదుడును పూర్తిగా వ్యతిరేకించి ర్యాంపుల్లోకి వాహనాలు వెళ్లకుండా అడ్డుకుని ఆందోళన చేపట్టారు. దీంతో గోదావరి పరివాహకంతో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. వినియోగదారునిపై అదనపు భారం పడుతుందని, బాట చార్జీల విధానాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు వాహనదారులు ప్రకటించారు. వారికి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు మద్దతు తెలపడంతో ర్యాంపుల నిర్వాహకులు దిగొచ్చారు. బాట చార్జీలు లేకుండానే ఇసుక లోడింగ్ చేయడానికి అంగీకరించారు. దీంతో వాహనదారులు ఆందోళన విరమించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం జొన్నాడ ర్యాంపులో ఇసుక తవ్వకాలు మొదలయ్యాయి.

జగ్గంపేటలో వీరబాబు కుటుంబానికి పరామర్శ

జగ్గంపేట, జనవరి 24: మండలంలోని గుర్రప్పాలెం గ్రామానికి చెందిన పడాల వీరబాబు కుటుంబాన్ని బుధవారం నారా భువనేశ్వరి పరామర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గతేడాది సెప్టెంబరు 19న గుండెపోటుతో మృతి చెందిన వీరబాబు కుటుంబ సభ్యులను కలిసి వారికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. నిజం గెలవాలి అనే కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి బుధవారం మధురపూడి ఎయిర్‌పోర్టు నుంచి జగ్గంపేట మండలం గుర్రప్పాలెం ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. నేరుగా వీరబాబు ఇంటికి చేరుకుని అతని భార్యని, కుటుంబ సభ్యులను పరామర్శించడంతోపాటు టీడీపీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాలయోగి, ఎమ్మెల్యే చినరాజప్ప, నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, ఉండవల్లి వీర్రాజు, పాఠంశెట్టి మురళీకృష్ణ, కొత్త కొండబాబు, పాఠంశెట్టి రవి, జ్యోతుల లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో రూ. 3 లక్షల చెక్కు అందజేత

పెద్దాపురం, జనవరి 24: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి యాత్ర బుధవారం పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో సాగింది. చంద్రబాబును స్కిల్ డవలప్‌మెంట్ కేసులో జైలులో నిర్బంధించిన సమయంలో వేదనకు గురై మృతి చెందిన బుద్దాల సుబ్బారావు కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. మృతుడు భార్య చెల్లాయమ్మ, కుమారులు రాజబాబు, సూరిబాబులను భువనేశ్వరి పరామర్శించి వారికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు తనయుడు మాట్లాడుతూ తన తండ్రి టీడీపీని ఎంతో అభిమానించేవారని, ఓసారి పార్టీ పనిపై హైదరాబాద్ వెళ్తే తన తండ్రి వద్ద డబ్బులు అయిపోయాయని, విషయాన్ని చంద్రబాబుకు చేరవేస్తే ఆయన సీఎంగా ఉన్న సమయంలో తన తండ్రికి ఏసీ బస్సు టిక్కెట్ తీయించి ఇంటికి పంపించారని గుర్తుచేస్తూ అప్పటికి టిక్కెట్‌ను చూపిస్తూ విలపించారు. దీంతో భువనేశ్వరి సైతం ఇదంతా విని చలించిపోయారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో ఘన స్వాగతం.. నేటి టూర్ షెడ్యూల్ ఇలా..

కాకినాడ జిల్లా పర్యటన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చేరుకున్న నారా భువనేశ్వరికి టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో బసచేసిన భువనేశ్వరి గురువారం ఉదయం 10 గంటలకు బయలుదేరి పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని అయినవిల్లి మండలం ఎస్.మూలపొలం వెళ్లి బాధిత కుటుంబానికి చెక్కు పంపిణీ చేస్తారు. తర్వాత ఉప్పలగుప్తం మండలం చల్లపల్లికి మధ్యాహ్నం 12.25 గంటలకు వెళతారు. అక్కడి నుంచి అల్లవరం మండలం రెల్లుగడ్డ వెళతారు. 1.40 గంటలకు పేరూరులో లంచ్‌కు ఆగుతారు. అనంతరం రాజోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని విశ్వేశ్వరాయపురానికి, అక్కడి నుంచి కపిలేశ్వరపురం మండలం నల్లూరుకు సాయంత్రం 5.30 గంటలకు, మండపేట పరిధిలోని పాలతోడుకు 6.40 గంటలకు, బిక్కవోలు మండలం బలభద్రపురానికి రాత్రి 7.10 గంటలకు చేరుకుని ఆ కుటుంబాలకు చెక్కులు అందిస్తారు.



- టీడీపీ-జనసేన కూటమిలో చేరుతున్న కీలక నేతలు
- అమలాపురం, రామచంద్రపురం సీట్ల కోసం పోటీ
- చంద్రబాబును కలిసిన వైసీపీ నేత రేవు శ్రీను
- ప్రజాదరణతో టీడీపీలోకి పెరుగుతున్న వలసలు
- కోనసీమ జిల్లాలో తాజా రాజకీయ ముఖ చిత్రం

ఆశల పల్లకిలో

ఆశావహులు

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వివిధ శాసనసభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు ఆశావహులైన అభ్యర్థులు ఆశల పల్లకిలో ఊరేగుతున్నారు. ప్రస్తుత రాజకీయ నాడిని తెలుసుకుంటున్న అభ్యర్థులు అధికార వైసీపీని వీడి టీడీపీ-జనసేన కూటమి వైపు అడుగులు వేస్తున్నారు. అంతే కాకుండా ఆయా పార్టీల్లో చేరుతూ ఎమ్మెల్యే టిక్కెట్ల కోసం ఆశలు పెంచుకుంటున్న పరిస్థితులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. అధికార వైసీపీకి ప్రజల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకతను అంచనా వేసుకుంటున్న అభ్యర్థులు ప్రస్తుతం టీడీపీ-జనసేన వైపు మొగ్గుచూపుతున్నారు. దాంతో ఆయా నియోజకవర్గాల్లో టిక్కెట్లు ఆశిస్తున్న అభ్యర్థుల మధ్య పోటీ రసవత్తరంగా మారతోంది. జిల్లా కేంద్రమైన అమలాపురంతో పాటు రామచంద్రపురం నియోజకవర్గాల్లో ఆశావహుల హడావిడి మరీ ఎక్కువగా ఉంది.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ-జనసేన కూటమిలో స్థానం కోసం ఎవరి లాబీయింగ్‌లను వారు చేసుకుంటున్నారు. అమలాపురం ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కొనసాగుతున్నారు. అయినప్పటికీ ఈ సీటుపై చాలా మంది కన్నేశారు. వారిలో మహిళల నుంచి మాజీ ఎంపీ అయితాబత్తుల బుచ్చిమహేశ్వరరావు కుమార్తె డాక్టర్ సత్యశ్రీ, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరిలతో పాటు సమనస సర్పంచ్ పరమట శ్యామ్, సీనియర్ న్యాయవాది, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యునిగా పనిచేసిన నాగాబత్తుల శ్రీనివాసరావు, పోతుల సుభాష్‌చంద్రబోస్‌తో పాటు మరో ఇద్దరు కీలక వ్యక్తులు టీడీపీ టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న శెట్టిబత్తుల రాజబాబు మహా సంకల్ప యాత్ర పేరుతో ప్రజల ముందుకు వెళ్తూ టిక్కెట్ నాదేనంటూ ప్రచారా ఆర్భాటం చేస్తున్నారు. అమలాపురం లోక్‌సభ జనసేన ఇన్‌చార్జి హోదాలో ఉన్న డీఎంఆర్ శేఖర్ కూడా అసెంబ్లీ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్సీ రిజర్వు నియోజకవర్గం కావడంతో టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి నుంచి పోటీ పడుతున్న అభ్యర్థుల సంఖ్య ఎక్కువగానే ఉంది. కాగా వైసీపీ నుంచి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేరునుఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసి త్వరలో ప్రకటించే అవకాశం ఉంది.

రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ-జనసేన కూటమి నుంచి సీటు కోసం పోటీపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిగా శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం కొనసాగుతున్నారు. ఆయనతో పాటు కాకినాడ సత్య స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు కాదా వెంకటరమణ, ఇటీవలే టీడీపీ తీర్థం తీసుకున్న శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన వాసంశెట్టి సుభాష్, రాయపురెడ్డి రాజా తదితరులు టీడీపీ సీటు కోసం ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. తాజాగా రాష్ట్ర సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అనుంగ శిష్యుల్లో ఒకరైన వప్పుల మసేను వెంకన్న అలియాస్ రేవు శ్రీను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుని కలవడం రామచంద్రపురం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. శ్రీను టీడీపీలో చేరతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం రాజ్యసభ సభ్యునిగా ఉన్న పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాష్‌ను వైసీపీ రామచంద్రపురం ఇన్‌చార్జిగా నియమించిన నేపథ్యంలో వ్యూహాత్మకంగా రేవు శ్రీను టీడీపీలో చేరేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే రేవు శ్రీను టీడీపీ అధినేత చంద్రబాబును అమరావతిలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రేవు శ్రీను చంద్రబాబును శాలువాతో సత్కరించి పార్టీలో చేరే అంశంపై మాట్లాడినట్టు తెలిసింది. త్వరలో టీడీపీలో చేరేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తంమీద నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నేతల జోష్ రోజురోజుకూ పెరుగుతోంది.



మంత్రి విశ్వరూప్‌కు వినతిపత్రం అందజేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

'సెర్ప్' ఉద్యోగుల సమ్మెబాట

- సర్వీసును రెగ్యులర్ చేయాలని డిమాండ్
- మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ సతీశ్‌లకు వినతిపత్రాలు

అమలాపురం రూరల్, జనవరి 24: వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగుల సర్వీసును రెగ్యులర్ చేయాలన్న ప్రధాన డిమాండుతో బుధవారం నిరవధిక సమ్మెకు దిగారు. జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులు భట్నవిల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పినిపే విశ్వరూప్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో సెర్ప్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని వివరించారు. గత మూడేళ్లుగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారానికి నోచుకోకపోవడంతో సమ్మెకు దిగినట్టు ప్రకటించారు. సెర్ప్ సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించి పనిచేస్తున్న ఉద్యోగులకు కేడర్ ఫిక్స్ చేసి పేస్కేలు అమలు చేయాలని డిమాండు చేశారు. హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు వర్తింపజేస్తూ అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని, కారుణ్య నియామకాలు జరపాలని, ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న విధంగానే గ్రాట్యుటీ కల్పించాలని కోరారు. సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు డి.వరాలబాబు, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, కోశాధికారి కేబీవీ ప్రసాద్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: జిల్లాలోని 22 మండలాల్లో పనిచేస్తున్న 58 మంది ఉద్యోగులు, జేఏసీ అధ్యక్షుడు బి.వరాలబాబు ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడసతీశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, నాడు-నేడు, సున్నా వడ్డీ, జగనన్న తోడు, జగనన్న కాలనీల నిర్మాణం, పేదలకు సుస్థిర జీవనోపాధి పెంపు వంటి సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించకపోవడంతో సమ్మెకు దిగుతున్నామన్నారు. జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు కూడా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎం.వెంకటేశ్వరరావు, కేబీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.02 కోట్లు

- వివరాలు 7లో

కాకినాడ చేరుకున్న వైఎస్ షర్మిల

నేడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలతో సమీక్ష... 7లో

చంద్రబాబును కలిసిన రేవు శ్రీను

- 7లో

వైసీపీ గుండాగిరీ

పెదపూడిలో జనసేన ప్రచార వాహనంపై వైసీపీ జులుం

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ

వాహన అద్దాలు ధ్వంసం

తాళాలు లాగేసుకుని,వాహన పత్రాలు

తీసుకువెళ్లిపోయిన వైసీపీ నేతలు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

(కాకినాడ,ఆంధ్రజ్యోతి) అనపర్తి నియోజకవర్గం పెదపూడిలో అధికార వైసీపీ నేతలు గుండాగిరీకి దిగారు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలపై గ్రామగ్రామాన తిరుగుతూ ప్రచారం చేస్తున్న జనసేన ప్రచార వాహనంపై దాడికి తెగబడ్డారు. రాత్రి ఏడు తర్వాత గ్రామాల్లో తిరుగుతోందని, జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారనే సాకుతో పెదపూడి మండలంలోని శహపురంలో వైసీపీ నేతలు వాహన అద్దాలు ధ్వంసం చేశారు. వాహనం తాళాలు లాగేసుకుని, జీపు రిజిస్ట్రేషన్, ప్రచార అనుమతి పత్రాలను లాక్కుపోయారు. దీంతో బుధవారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దీంతో జనసేన, టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. అదే సమయంలో అటువైపు వెళ్తున్న అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సైతం వైసీపీ నేతల తీరుతో మండిపడుతూ ఆందోళనకు దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఒకానొక సమయంలో టీడీపీ,జనసేన నేతలపై పోలీసుల సమక్షంలో వైసీపీ నేతలు దాడి చేయడానికి పైకి రావడంతో అటువైపు నుంచి కూడా ప్రతిఘటన ఎదురైంది. ఈ నేపథ్యంలో శహపురంలో సాయంత్రం ఆరు వరకు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

దాడిచేసి..తాళాలు లాగేసి..

కాకినాడ జిల్లా పెదపూడి మండలం శహపురంలో సామర్లకోట మండలం మాధవ పట్నానికి చెందిన పన్నీరు వెంకటేశ్వరరావు, అతని కుమారుడు పన్నీరు శివన్నారాయణలు గత మూడు రోజులుగా జనసేన తరఫున ప్రచార రథంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. దీన్ని తట్టుకోలేక స్థానిక వైసీపీ నేతలు వాహనాన్ని రెండురోజులుగా అడ్డుకుంటున్నారు. తొలుత మంగళవారం మధ్యాహ్నం సమయంలో వైసీపీకి చెందిన బుద్దా శ్రీను జనసేన ప్రచారవాహనాన్ని అడ్డుకున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ప్రచార వాహనాన్ని నడుపుతున్న వెంకటేశ్వరరావు అయన కుమారుడుని స్టేషన్‌కు తరలించారు. తీరా వాహనానికి అనుమతులు ఉండడంతో అదే రోజు రాత్రి వీరిద్దరిని పోలీసులు పంపేశారు. తిరిగి బుధవారం జనసేన ప్రచార వాహనం శహపురంలో ప్రచారం చేస్తోంది. దీంతో వైసీపీ నేత బుద్దా వెంకన్న, స్థానిక ఎంపీటీసీ భర్త చందళ్ల వెంకటరమణ, మరికొంతమంది కలిసి ప్రచార వాహనాన్ని అడ్డుకున్నారు. గ్రామంలోకి రావొద్దని హుకుం జారీ చేశారు. అనుమతులు ఉన్నాయని, కావాలంటే మీరు కూడా ప్రచారం చేసుకోండని జనసేన నేతలు అనడంతో వాహనంపై దాడి చేసి అద్దాలు పగలగొట్టారు. తాళాలు తీసుకుని వెళ్లిపోయారు. దీంతో జనసేన నేతలు ఆందోళనకు దిగారు. ఓ శుభ కార్యంలో పాల్గొనడానికి వచ్చిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడకు చేరుకుని వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని సీఐ,ఎస్ఐకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పోలీసుల నుంచి స్పందన లేదు. దీంతో ఆందోళనకు దిగారు. దీంతో వైసీపీ నేతలు కూడా అక్కడకు చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగింది. పక్కనే పోలీసులు ఉన్నా టీడీపీ, జనసేన శ్రేణులపైకి దాడికి వస్తున్న వైసీపీ నేతలను అడ్డుకోలేదు. కాకినాడ రూరల్ సీఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ క్రమంలో జనసేన వాహనంపై దాడికి దిగిన వైసీపీ నేతలపై కేసులు నమోదు చేయాలని టీడీపీ, జనసేన శ్రేణులు డిమాండ్ చేశాయి. దీంతో మళ్లీ ఓ సారి ఇరువర్గాలు వాగ్వాదానికి దిగడంతో పోలీసులు చెదరగొట్టారు. ప్రచార వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ వాహనానికి అనుమతులు ఉన్నా అడ్డుకోవడం వైసీపీ నిరంకుశ ధోరణికి అద్దం పడుతోందన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలపై కేసులు పెట్టడమే లక్ష్యంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఎస్ఐ శోభన్ కుమార్ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రచార వాహనాన్ని స్టేషన్‌కు తరలించామన్నారు.



వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న నేతలు

వెంకన్న హుండీల ఆదాయం రూ.1.02 కోట్లు

ఆత్రేయపురం, జనవరి 24: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారులు కె.విజయలక్ష్మి, ఎం.రాధాకృష్ణ, ఎస్.ప్రసాద్‌రాజు పర్యవేక్షణలో బుధవారం హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. 35 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.74,29,750, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.28,48,913.. మొత్తం రూ.1,02,78,663 లభించినట్టు ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. బంగారం 11 గ్రాములు, వెండి 739 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ లభించాయి. క్షేత్రపాలకుడు విశ్వేశ్వర స్వామి హుం డీల ద్వారా రూ.2,54,454 ఆదాయం లభించింది. లెక్కింపులో ఆలయ ధర్మకర్తలు, బ్యాంకు సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకుపోయిన ఎరువుల లారీ




అనపర్తి, జనవరి 24 : అనపర్తి మండలం కొప్పవరంలో ఎరువుల లోడుతో వచ్చిన లారీ కాకినాడ కెనాల్‌లోకి అదుపుతప్పి దూసుకుపోయింది. లారీ డ్రైవర్ అప్రమత్తం కావడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. లారీ డ్రైవర్ గోవిందు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సామర్లకోటలోని ఏపీ మార్క్‌ఫెడ్ నుంచి కొప్పవరం సొసైటీకి సుమారు 400 బస్తాల యూరియాతో లారీ గ్రామానికి చేరుకుంది. అయితే సొసైటీలో సరుకును అన్‌లోడ్ చేసేందుకు లారీ కాలువ గట్టు నుంచి మలుపు తిప్పుతున్న క్రమంలో అదుపు తప్పి కాకినాడ కాలువలోకి దూసుకుపోయింది. అప్రమత్తమైన డ్రైవర్ గోవిందు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీ కాలువలో పడ్డ కొద్దిసేపటికే సుమారు 6.80 లక్షల యూరియా గంగపాలయ్యింది.

త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ

దివాన్‌చెరువు, జనవరి24 : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ అందిస్తామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. సామాజిక ఇంజనీరింగ్ యాక్సెస్, యువత సాధికారత, ఉపాధి అనే అంశంపై నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని పూర్తిస్థాయిలో మన ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కరిక్యులమ్‌లో 30 శాతం నైపుణ్య కార్యక్రమాలు ఉన్నాయన్నారు. రిసోర్స్‌పర్సన్లుగా హాజరైన బెంగళూరులోని జేవీయర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రొఫెసర్ ఎస్.ఎం.కె.భట్ట, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ లోకానందరెడ్డి ఐరాల వివిధ విషయాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య కె.శ్రీరమేష్, కోకన్వీనర్ పి.ఉమామహేశ్వరీదేవి, అధ్యాపకులు ఎన్.ఉదయభాస్కర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన రేవు శ్రీను



కె.గంగవరం, జనవరి 24: ఎన్నికల ముందు రామచంద్రపురం నియోజకవర్గంలో వైసీపీకి పెద్ద దెబ్బతగిలింది. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు అత్యంత సన్నిహితుడైన బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను) బుధవారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబును హైదరాబాద్‌లో కలిశారు. నియోజకవర్గంలో గతంలో జరిగిన ఎన్నికల్లో తోట త్రిమూర్తులు విజయానికి విశేష కృషి చేసిన వ్యక్తుల్లో రేవు శ్రీను ఒకరు. ప్రస్తుత పరిస్థితుల్లో రామచంద్రపురం నియోజకవర్గం నుంచి తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా రేవు శ్రీను పోటీ చేస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. బుధవారం చంద్రబాబును కలవడంతో వాటికి మరింత బలం చేకూరాయి. శ్రీను మంచి ముహూర్తం చూసుకుని పార్టీలో చేరతారని ఆయన వర్గీయులు చెబుతున్నారు.

పోక్సో కేసులో యువకుడికి రెండున్నరేళ్ల జైలు

రాజమహేంద్రవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి), కాకినాడ క్రైం: పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో నేరస్తుడికి కోర్టు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన చింతపల్లి సుబ్బారావు రోజూ ఓ బాలిక వెంటపడి వేధించేవాడు. 2018 సెప్టెంబరు 17న ఆ బాలిక తన పెద్దమ్మ దుకాణం వద్ద ఉండగా ఆ యువకుడు చున్నీ పట్టుకు లాగాడు. దీనిపై పెద్దమ్మ నిలదీయగా ఆమెను కొట్టాడు. ఆమె ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నేరస్తుడికి రెండున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ విచారణలో ఉన్న కేసుల ప్రత్యేక పర్యవేక్షణ సత్ఫలితాలను ఇస్తోందన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది పితాని శ్రీనివాసరావు, ఏఎస్ఐ సీహెచ్ రామన్నదొర, అప్పటి ఎస్ఐ ఆర్.శివాజీ, సీఐ జీ.ఉమామహేశ్వరరావు, ఎస్ఐ కె.సతీశ్, హెచ్‌సీ ఎం.సత్యకుమార్, కానిస్టేబుల్ సతీశ్‌ని ఎస్పీ అభినందించారు.

రౌడీషీటర్‌కి రెండేళ్ల జైలు

పెండింగ్ కేసుల్లో నిందితుడిగా ఉన్న గుజ్జర్ల రామకృష్ణని అదుపులోకి తీసుకోవడానికి అతడి ఇంటికి 2022 మార్చి 2న ఎస్ఐ అప్పారావు, కానిస్టేబుల్ అశోక్ వెళ్లారు. పోలీసులతో రామకృష్ణ వాగ్వాదానికి దిగడంతో పాటు ఎస్ఐని ఎదురుబొంగుతో కొట్టి గాయపరిచాడు. రామకృష్ణని అదుపు చేయడానికి కానిస్టేబుల్ అశోక్ ప్రయత్నించగా ఆయనపై బటన్‌నైఫ్‌తో దాడి చేశాడు. నేరం రుజువు కావడంతో రామకృష్ణకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. పీపీ కోడి సతీష్‌నాయుడు, త్రీటౌన్ సీఐ వీరయ్యగౌడ్, అప్పటి ఎస్ఐ టి.శ్యాంసుందర్, హెచ్‌సీ ఎన్.వెంకటేశ్వరరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

కాకినాడ చేరుకున్న వైఎస్ షర్మిల

నేడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పార్టీ సమీక్షకు హాజరు



షర్మిలకు స్వాగతం పలుకుతున్న నేతలు

కాకినాడ సిటీ, జనవరి 24: ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశాల నిమిత్తం పర్యటనలు చేపట్టిన పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల బుధవారం రాత్రి కాకినాడలోని హోటల్ జీఆర్‌టీ గ్రాండ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు, ఏఐసీసీ కాకినాడ పార్లమెంట్ కోఆర్డినేటర్ కేబీఆర్ నాయుడు, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా ప్రసాద్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటరమణ, కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా ప్రసాదవర్మ, పీసీసీ సభ్యుడు కుక్కల పోతురాజు స్వాగతం పలికారు. విశాఖపట్నం నుంచి మధ్యాహ్నం రోడ్డు మార్గం గుండా బయలుదేరి కాకినాడ చేరుకున్నారు. రాత్రికి కాకినాడలో షర్మిల బస చేస్తారు. కాకినాడ, కోనసీమ, రాజమహేంద్రవరం జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఉదయం జీఆర్‌టీ వద్దకు చేరుకోనున్నారు. ఉదయం 9 గంటలకు అక్కడి నుంచి నాయకులు వెంట రాగా కాన్వాయ్‌గా బయలుదేరి కుళాయిచెరువు నూకాలమ్మ గుడి సెంటర్, జవహర్‌రోడ్, మెయిన్‌రోడ్, టౌన్ హాల్ మీదుగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకుని విజిటర్స్ బుక్ లో సంతకం చేస్తారు. అనంతరం సూర్యకళా మందిరం సభా ప్రాంగణానికి చేరుకుని ఉదయం 10 నుంచి 12గంటల వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పార్టీ సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం ఏలూరు బయలుదేరి వెళ్తారు. షర్మిల వెంట పీసీసీ మాజీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, ఏఐసీసీ కార్యదర్శి జేడీ శీలం ఉన్నారు.

లాన్ టెన్నిస్ పోటీల విజేత హరియాణా

కాకినాడ రూరల్, జనవరి 24: కాకినాడలో 5 రోజులపాటు నిర్వహించిన 67వ జాతీయస్థాయి బాలుర లాన్‌టెన్నిస్ పోటీలు బుధవారం మధ్యాహ్నం ముగిశాయి. 19 ఏళ్ల లోపు బాలురకు నిర్వహించిన ఈ పోటీల్లో 23 రాష్ట్రాల నుంచి 109 మంది క్రీడాకారులు పాల్గొనగా మొత్తం 154 మ్యాచ్‌లు జరిగాయని పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. పోటీలు కాకినాడ డీఎస్ఏ, డీమార్ట్ సమీపంలో గల స్మార్ట్‌సిటీ టెన్నిస్‌క్లబ్, ఎస్పీ కార్యాలయం వెనుక గల టెన్నిస్ మైదానంలోనూ జరిగాయన్నారు. వ్యక్తిగత విభాగంలో హరియాణా క్రీడాకారుడు అర్జున్‌రాఠీ ప్రథమ స్థానంలోనూ, తెలంగాణకు చెందిన వి.ధీరజ్ ద్వితీయ, గుజరాత్ క్రీడాకారుడు వహీన్‌పటేల్ తృతీయ, తెలంగాణకు చెందిన శాండిల్య నాలుగోస్థానంలోనూ నిలిచారు. టీమ్ విభాగంలో ప్రథమ స్థానంలో హరియాణా, ద్వితీయ స్థానంలో గుజరాత్, తృతీయ స్థానంలో మహారాష్ట్ర, నాలుగో స్థానంలో ఢిల్లీ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల ముగింపోత్సవ, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, విశిష్ట అతిథిగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ లాన్ టెన్నిస్ జాతీయ పరిశీలకులు రామిరెడ్డి, చీఫ్ రిఫరీ శ్రీకుమార్, కర్రి భామిరెడ్డి పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర ఛైర్మన్ జి.భానుమూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి టీవీఎస్వీ ప్రసాద్ పోటీలను పర్యవేక్షించారు. కన్నబాబు మాట్లాడుతూ శారీరక, మానసిక ఎదుగుదలకు క్రీడలు సహకరిస్తాయన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను, ప్రతిభా పత్రాలను అందజేశారు. రాష్ట్ర టెన్నిస్ సంఘం కార్యదర్శి కుమార్, డీవైఈవోలు డేనియల్ రాజు, సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్‌కుమార్, ఎంఈవోలు రవి, ఏసుదాసు, శివప్రసాద్, పుల్లయ్య, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రంగారావు, పీఈటీలు రవిరాజు, బంగార్రాజు, నూకరాజు, శ్రీనివాస్, పట్టాభి, మానసరావు, వెంకటేష్, త్రిపుల, భానుమతి, శ్రీనివాస్, సువర్చల, మేరీ విజయ, తులసి, సత్యగౌరి, శ్రీలక్ష్మి, శ్రీహరిరాజు, సూరిబాబు, హుస్సేన్, ప్రసాదరావు పర్యవేక్షించారు.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి



అనపర్తి, జనవరి 24 : అనపర్తి మండలం రామవరం శివారు రామదాసు పుంత రోడ్డులో రాయవరం వెళ్లే దారిలో రోడ్డు పక్కనే గుడిసె వేసుకుని జీవిస్తున్న జంట అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటం సంచలనంగా మారింది. అయితే వారు సంచార జీవనం సాగిస్తున్నారని, నాలుగేళ్లుగా సహజీవనం చేస్తున్నట్టు తెలిసింది. ఎస్ఐ రామారావు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామదాసు పుంత రోడ్డులో గుడిసె వేసుకుని సహజీవనం చేస్తున్న సూరిబాబు (35), మేడపాటి లక్ష్మి (45) బుధవారం ఉదయం మృతి చెంది ఉండటాన్ని గమనించి రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వారు సుమారు నాలుగేళ్లుగా సహజీవనం చేస్తున్నారని, ఎలుకలు పట్టుకుని జీవిస్తుంటారని నిత్యం మద్యం మత్తులో ఉంటారని స్థానికులు చెప్పారన్నారు. లక్ష్మీ బంధువులు పెదపూడి మండలం గండ్రేడులో ఉన్నారని తెలియడంతో వారికి సమాచారం అందించామన్నారు. శవ పంచనామాలు నిర్వహించి అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని మృతదేహాలను అనపర్తి ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఎస్ఐ రామారావు తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే విజయాలు

- **స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్**
- **పలువురు ప్రముఖులకు వివేకానంద పురస్కారాలు ప్రదానం**



పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

అనపర్తి, జనవరి 24 : ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగితే సాధించలేనిది ఏదీ లేదని, స్వామి వివేకానందుడు చెప్పిన మార్గాలను అనుసరించడం ద్వారా విజయం మన చెంతనే ఉంటుందని స్వర్ణ భారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె దీపావెంకట్ అన్నారు. అనపర్తిలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద యువజనోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువజనోత్సవం సందర్భంగా అనపర్తిలోని వివేకానంద సెంటర్‌లో స్వామి వివేకానందుడి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ గాలిలోకి బెలూన్లను ఎగురవేసి యువజనోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దుప్పలపూడిలోని ఆర్‌వీఆర్ కన్వెన్షన్ హాలులో సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన యువ జనోత్సవంలో 2024 ఏడాదికి గాను ఆధ్యాత్మిక రంగంలో సేవలందిస్తున్న ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు, వైద్య రంగంలో సేవలందిస్తున్న డాక్టర్ గోలి వెంకటరామారావు, న్యాయ రంగంలో సేవలందిస్తున్న హైకోర్టు న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డిలకు స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలను, స్వర్ణ భారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ యిమ్మణ్ణి దీపా వెంకట్‌కు స్వామి వివేకానంద ఎక్స్‌లెన్స్ అవార్డులతో పాటు స్వామి ప్రతిమ, మెమెంటోలను ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ అందజేశారు. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి జీవితంలో ముందడుగు వేసేలా చైతన్య పరచడమే స్వామి వివేకానందుని లక్ష్యమని అన్నారు. దీపా వెంకట్ ప్రసంగిస్తూ సేవ చేయడం ద్వారా ఆత్మ సంతృప్తి లభిస్తుందని తన తండ్రి వెంకయ్య నాయుడి స్ఫూర్తితో ట్రస్టును ప్రారంభించి గ్రామీణ ప్రాంతాలలో యువతకు పలు అంశాలపై శిక్షణను అందిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా సమితి సేవలు అందించడమే కాకుండా వివేకానందుని భావజాలాన్ని యువతలోకి తీసుకువెళ్లేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. స్వామీజీ మాట్లాడుతూ దేశ నిర్మాణానికి మూల స్తంభాలు వంటి యువతలో ఉత్సాహం నింపడమే స్వామీజీ లక్ష్యంగా జీవించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు సబ్బెళ్ళ అమ్మిరెడ్డి, సత్తి లక్ష్మణరెడ్డి, మేడపాటి రామలింగారెడ్డి, చింతా గోపీకృష్ణారెడ్డి, రామకృష్ణ మిషన్ సభ్యుడు దుర్గాప్రసాద్, సమితి ప్రతినిధులు సత్తి బులితమ్ము, తేతల సుందరరామారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్



ఆరోగ్య కార్యక్రమాలపై ఆరా తీస్తున్న కేంద్ర మంత్రి

దివాన్‌చెరువు, జనవరి 24 : కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు హౌసింగ్ బోర్డులోని హెల్త్‌క్లినిక్‌ను కేంద్ర మంత్రి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం ద్వారా అందజేస్తున్న వివిధ ఆరోగ్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న వైద్య సేవలు, మందుల పంపిణీ వంటి కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యపరంగా తీసుకుంటున్న చర్యలకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. జగనన్న కంటి వెలుగు లబ్ధిదారునికి కంటి అద్దాలు అందించారు. పీహెచ్‌సీ ద్వారా అందజేస్తున్న సేవలను నిక్షిప్తం చేయడం ద్వారా ఫాలోఅప్ వైద్యసేవలు అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ చేపట్టి ప్రజల వద్దకే వైద్యసేవలు వెళుతున్నాయన్నారు. అనంతరం టీబీ బాధితునికి నిక్షయ మిత్రా కిట్లను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.సనత్ కుమారి, జిల్లా క్షయ నివా రణాధికారి డాక్టర్ వసుంధర, పాలచర్ల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బెనడిక్ట్, డాక్టర్ శ్రీరాణి, బీజేపీ నాయకులు సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నాటకాలను బతికించుకోవాలి



కొత్త పరిమళంలో సన్నివేశం

పెద్దాపురం, జనవరి 24: నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం నేటి సమాజంపై ఎంతైనా ఉందని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి నాటికల పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి సమాజాన్ని నిర్మించుకోవడానికి కళలు, నాటకాలు ఎంతో దోహదపడతాయన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, కురుమెళ్ల లోవరాజు మాట్లాడుతూ మానవతా విలువలకు ప్రతిరూపమే నాటకాలన్నారు. ద్వేషం అనేది మనిషికైనా, దేశానికైనా ప్రమాదమే అనే సందేశంతో సాగిన కొత్త పరిమళం నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నాటికకు కాండ్రేగుల శ్రీనివాసరావు రచన చేయగా కేఎల్ స్వామి నాటకీకరణ చేశారు. ఎం.హేమాపట్నాయక్ దర్శకత్వం వహించారు. శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం బోరివంక (శ్రీకాకుళం జిల్లా)కు చెందిన నటులు ఈ ప్రదర్శన ఇచ్చారు. రెండో ప్రదర్శనగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. మేధావుల నిశ్శబ్దం జాతికి ఎంతో ప్రమాదమనే అంశంతో ఈ నాటిక సాగింది. తెలుగు కళా సమితి (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించగా ఈ నాటికకు రచన పీటీ మాధవ్, పర్యవేక్షణ కువైట్ స్వామి, దర్శకత్వం కృష్ణప్రసాద్ వహించారు. కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, సీఎస్ఆర్ మూర్తి, ఇంధన బ్రహ్మానందం, రవీంద్ర, కేదార నాగు, మంతెన సత్తిబాబు, పాలని సత్తిబాబు, పాపేశ్వరరావు పాల్గొన్నారు.

29న రాజమహేంద్రవరంలో 'రా కదలిరా' సభ

హాజరుకానున్న చంద్రబాబు

రాజమహేంద్రవరం, జనవరి24(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 29వ తేదీన రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో జరిగే తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా బహిరంగ సభలో పాల్గొననున్నారు. వాస్తవానికి ఈ సభను ఈ నెల 27న నల్లజర్ల మండలం దూబచర్లలో నిర్వహించాల్సి ఉంది. కానీ జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొనడానికి దూరం అవుతుందనే కారణంతో రాజమహేంద్రవరానికి మార్పు చేశారు. ఫోర్త్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు దగ్గరలో కొంతమూరు, కోలమూరు ప్రాంతాల్లో సభా స్థలం కోసం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం పరిశీలించారు. 26న నారా భువనేశ్వరి బిక్కవోలులోనూ, నిడదవోలులోనూ "నిజం గెలవాలి" అనే కార్యక్రమంలో పాల్గొంటున్న విషయం తెలిసిందే.

ఆదివాసీ వ్యతిరేక చర్యలను ప్రభుత్వం మానుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న వక్త

రాజమహేంద్రవరంరూరల్, జనవరి 24: ఆదివాసీ వ్యతిరేక చర్యలను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని రైతుకూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడు ఎల్లా రామిరెడ్డి అన్నారు. రూరల్ మండలం ధవళేశ్వరంలోని ఓ కమ్యూనిటీ హాలులో పోలవరం నిర్వాసితుల సంఘీభావ సదస్సు ఎల్లా రామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిలో సంపదను అడవిని, చెట్లను, అన్నిటిని కాపాడేది ఆదివాసులే అన్నారు. అటువంటి ఆదివాసీలను అడవి నుంచి వెళ్ల గొట్టే కుట్రలు చేయడం దారుణమన్నారు. పోలవరం నిర్వాసితుల పునరావాసానికి కేంద్రం పూర్తి బాధ్యత వహించాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ స్పష్టం చేశారు. ఆదివాసీల లీగల్‌సెల్ కన్వీనర్ పల్లా త్రినాథ్ మాట్లాడుతూ ఆదివాసీలు ధర్మమైన డిమాండ్లు అడుగుతున్నారని, వారికి భూమికి భూమి, మెరుగైన పునరావాసం కల్పించడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అన్నారు. రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ ఝాన్సీ మాట్లాడుతూ 2017లో కొండమొదలు గిరిజనులతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీని నిర్వాసితులందరికీ వర్తింపచేయాలన్నారు. పునరావాస కాలనీలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని, 426 ఎకరాల భూమికి భూమిని పునరావాస కేంద్రంలో కల్పించాలని డిమాండ్ చేశారు. దేవీపట్నం, కురుపల్లి నిర్మాణంలో జరుగుతున్న పనులను సరిచేసి వెంటనే కాలనీల నిర్మాణం చేయాలని ఏలూరు జిల్లాలో తెల్లవారు చేగుంటపల్లి గ్రామాలకు భూమికి భూమి ఇవ్వాలని రాష్ట్ర కార్యదర్శి ఎం ఎస్ నాగరాజు అన్నారు.

నేపాల కాయలు తిని చిన్నారులకు అస్వస్థత



ఏలూరు క్రైం/నల్లజర్ల, జనవరి 24 : బేరన్ పొగాకు కొట్టే పనులకు వలస కూలీలుగా వచ్చిన వారి పిల్లలు నేపాల చెట్టు కాయలు తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. గుంటూరు జిల్లా, పల్నాడు జిల్లా ప్రాంతాలకు చెందిన 22 మంది వలస కూలీలు నల్లజర్ల మండలం పోతవరం గ్రామంలోని పొగాకు రైతుల బేరన్ పొగాకు కొట్టే పనుల కోసం 12 రోజుల క్రితం వచ్చారు. వారితో పాటు 11 మంది పిల్లలు కూడా వచ్చారు. పెద్దలు పనికి వెళ్లిన సమయంలో బుధవారం మధ్యాహ్నం పిల్లలు మకాం సమీపంలోని నేపాల చెట్ల కాయలను తిని ఎనిమిది మంది వాంతులు చేసుకున్నారు. తల్లిదండ్రులు వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంవో ప్రసాదరెడ్డి, చిన్నపిల్లల వైద్య చికిత్స విభాగం హెచ్ఓడీ డాక్టర్ ఎ.దీపక్‌కుమార్ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెప్పారు.

పరిటాల రవి వర్ధంతి

రామచంద్రపురం, జనవరి 24: మాజీ మంత్రి పరిటాల రవి 19వ వర్ధంతి సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్ రాయ్ స్థానిక ముచ్చుమిల్లిరోడ్‌లోని అనాధ శరణాలయంలో పిల్లలకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, టి.ఎన్.ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లం దివాకర్, ఈదల దొరబాబు, కొసనా శ్రీనివాసరావు, పోలిశెట్టి నాగు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

• మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
• కేశవరంలో బాబు ష్యూరిటీ... కార్యక్రమం
• టీడీపీ మేనిఫెస్టో పథకాలపై ప్రచారం

బాబు, పవన్‌తోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి



కేశవరంలో భవిష్యత్‌కు గ్యారంటీలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జనవరి 24: రాష్ట్రంలో వైసీపీ పాలనకు కాలం చెల్లిందని, రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీ, జనసేన పార్టీలను గెలిపించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తోనే రాష్ట సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. కేశవరంలో బుధవారం జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు ఆయన వివరించారు. స్థానిక టీడీపీ నాయ కులు కర్రితాతారావు, కంటిపూడి శ్రీనివాసరావు, ఉండమట్ల సురేష్, ఉండమట్ల సత్యనారాయణమూర్తి, గుండ్ల ఈశ్వరరావు, కంటిపూడి రాంబాబు, కంటిపూడి సూర్యచంద్రరావు, తోర్లపాటి ప్రసాద్, చిత్తులూరి నాగేశ్వరరావు, టీడీపీ మండల అదక్షుడు యరగతపు బాబ్జి, వాదా ప్రసాదరావు, షేక్ ఇబ్రహీం, సల్మాన్, పాలచర్ల శిరీష పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ మృతి బాధాకరం

అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన నిరంకుశత్వ వైఖరితో కేశవరానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ చంద్రమళ్ల శేషారత్నం గుండెపోటుకు గురై మరణించడం బాధాకరమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శేషారత్నం చిత్రపటానికి బుధవారం వేగుళ్ల నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక టీడీపీ నాయకులు కర్రి తాతారావు, కంటిపూడి శ్రీనివాస్, వాదా ప్రసాదరావు, తోర్లపాటి ప్రసాద్, ఉండమట్ల సురేష్, సత్యనారాయణ, కంటిపూడి రాంబాబు, గుండ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.



కొత్తపేట: మాట్లాడుతున్న బండారు సత్యానందరావు

మహిళలను మోసంచేసిన వైసీపీ ప్రభుత్వం

మలికిపురం, జనవరి 24: మహిళలకు అనేక హామీలు ఇచ్చి వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం మలికిపురంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఎంతో మేలు చేసానని మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి ఇటీవల నిరసన తెలిపిన అంగన్ వాడీలను అనేక ఇబ్బందులకు గురిచేసి వారిపై లాఠీ చార్జీ చేసిన సంగతి అంతా గమనించారన్నారు. సమావేశంలో జంపన సత్యనారాయణరాజు, చెల్లింగి సత్య నారాయణ, పిండి సత్యనారాయణ, బొక్కా గోవిందు, చాగంటి స్వామి, వలవల శేఖర్, రామరాజు, శరత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వంచించిన సీఎం జగన్

ఉప్పలగుప్తం, జనవరి 24: మద్యం నిషేధం అమలుచేసి తీరుతానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మాటతప్పి మహిళలను నిలువునా వంచించారని టీడీపీ అమలాపురం అసెంబ్లీ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు ఆరోపించారు. గొల్లవిల్లిలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ స్వగృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 1.14కోట్ల డ్వాక్రా మహిళలుంటే కేవలం 79లక్షల మందికి మాత్రమే ఆసరా వర్తింపజేయడం వారిని మోసం చేయడమేనన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసు పాల్గొన్నారు.

టీడీపీతోనే దళితవాడల అభివృద్ధి

ఆలమూరు: దళితవాడల అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం నవాబుపేటలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందించారు. మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిల విడుదలకు యూటీఎఫ్ పోరుబాట



కలెక్టరేట్ ఎదుట కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

అమలాపురం టౌన్, జనవరి 24: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చెల్లించాలని డిమాండు చేస్తూ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం 'పోరుబాట' నిర్వహించారు. అమలాపురం ఎంప్లాయీస్ హోం నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు మోటారు సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. సెంటర్‌లో కొద్దిసేపు నిరసన తెలిపారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు పోరుబాట ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా శాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పీఆర్సీ బకాయిల విడుదలకు రూపొందించిన ఉత్తర్వులు జారీ చేయాలని, 12వ పీఆర్సీ అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు వెంటనే చెల్లిచాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోరుబాటలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, గౌరవాధ్యక్షుడు బేతినీడి శ్రీనివాస్, కోశాధికారి కేశవరావు, జిల్లా కార్యదర్శులు జీవీ రమణ, పి.మురగేశ్వరరావు, బాలాజీ, మురళీ, పి.శ్రీనివాసరావు, చంద్రకళ, కె.శ్రీనివాసరావు, వి.రత్నం పాల్గొన్నారు.

సమ్మె విరమించినా తెరుచుకోని కేంద్రాలు

అమలాపురం టౌన్, జనవరి 24: అంగన్‌వాడీలు 42 రోజుల అనంతరం సమ్మె విరమించినప్పటికీ ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు నేటికీ తెరుచుకోలేదు. అంగన్‌వాడీలు సమ్మెలో ఉండగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారుల సమక్షంలో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులకొట్టి సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. అంగన్‌వాడీలు ఆయా కేంద్రాలకు చేరుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు పడుతున్నా సచివాలయ సిబ్బంది ఆయా కేంద్రాల తాళాలను అప్పగించకపోవడం, సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేయకపోవడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీలు ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు కార్యాలయం వద్దకు బుధవారం చేరుకుని నిరసన తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకునే విధంగా వెంటనే తాళాలు అప్పగించాలని డిమాండు చేశారు. నిరసనలో పలు మండలాలకు చెందిన కె.బేబీగంగారత్నం, విజయ, రత్నకుమారి, సీత తదితరులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల నిరసన

ఇంకా ప్రారంభంకాని అంగన్‌వాడీ సేవలు

అంతర్వేది, జనవరి 24: విధులకు హాజరుకావాలని ప్రభుత్వం పిలుపునిచ్చినా ఇంకా కొన్నిచోట్ల తాళాలు వేసి ఉన్న అంగన్‌వాడీకేంద్రాల వద్ద సిబ్బంది ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలు దుర్వాసన కొడుతూ దుర్గంధం వెదజల్లుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

పొన్నాడ హనుమంతరావు కాంస్య విగ్రహావిష్కరణ



హనుమంతరావు విగ్రహావిష్కరణ దృశ్యం

రాజోలు, జనవరి 24: రాజోలులో గాంధీహౌస్, పొన్నాడ బిల్డింగ్స్‌లో డాక్టర్ పొన్నాడ హనుమంతరావు ప్రథమ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ హనుమంతరావు కాంస్య విగ్రహాన్ని కుమారులు పొన్నాడ సూర్యప్రకాష్, సూర్యారావు, కుటుంబ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం హనుమంతరావు జీవిత చరిత్ర పుస్తకాన్ని డాక్టర్ కె.సీతారామారావు ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి మాట్లాడుతూ న్యాయవాది, గాంధేయవాది, సామాజికవేత్తగా నేటి తరానికి పొన్నాడ స్ఫూర్తిణీయమన్నారు. పీసీసీసభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ న్యాయవాదిగా ఉంటూ అనేకసేవా కార్యక్రమాలు చేశారన్నారు. మహాత్మా గాంధీ బస చేసిన పొన్నాడ గృహాన్ని గాంధీ హౌస్‌గా మార్చారని తెలిపారు. సీనియర్ న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు, పొన్నాడ సూర్యారావు, రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబు, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీ శ్వరి, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, రాజోలు చాంబర్ ఆఫ్‌కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, ఉపసర్పంచ్ పామర్తి రమణ, దార్ల పెదబాబు, ఐ.సూర్యనారాయణమూర్తి పాలొన్నారు.

నేడు రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుని రాక

అమలాపురం రూరల్, జనవరి 24: రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లం ఆనంద్‌ప్రకాష్ గురువారం అమలాపురం రానున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్షిస్తారు. వినతులు స్వీకరిస్తారు. తర్వాత రాజమహేంద్రవరం వెళ్తారు.

బాలికల హక్కులను రక్షించడమే లక్ష్యం



విద్యార్థులకు షీల్డులు, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

• కలెక్టర్ హిమాన్షు శుక్లా
• ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

అమలాపురం టౌన్, జనవరి 24: బాలికల హక్కులను రక్షించడమే బాలికల దినోత్సవ ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బాలికల సాధికారిత, సమాజంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు ప్రతిఏటా జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన 9మంది విద్యార్థులకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా షీల్డులు, సర్టిఫికెట్లు, ప్రోత్సాహక బహువతులు అందజేశారు. డీఈవో ఎం.కమల కుమారి, ఎంఈవో జి.సూర్యప్రకాశం, పీఎస్ శర్మ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: బాలికలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించి దేశ గౌరవాన్ని ప్రపంచానికి ఇనుమడింప చేసేలా కృషి చేయాలని సీనియర్ న్యాయవాది టి.నాగరాజారావు పేర్కొన్నారు. పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్, చైతన్య వలంటరీ ఆర్గనైజేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానికజడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం సీహెచ్ పరిమళ అధ్యక్షతన జరిగిన జాతీయ బాలికా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. మరో సీనియర్ న్యాయవాది డి.ఆంజనేయుడు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ, ఆర్గనై జేషన్ అధ్యక్షుడు కస్సిడి వెంకటేశ్వరరావు, మెల్లం దుర్గా ప్రసాద్, కోలా వెంకటేశ్వరరావు, బి.రాంప్రసాద్ మాట్లాడారు. వివిధ పోటీల్లో విజేతలైన 25మంది విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగేస్థానిక యాపిల్ స్కూలులో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం.. బతకనిద్దాం.. చదవ నిద్దాం.. ఎదగనిద్దాం.. అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు .బాలికలకు బాలురు మోకాళ్లపై నిలుచుని సెల్యూట్ చేశారు. కరస్పాండెంట్ గోదశి పుండరీష్, ప్రిన్సిపాల్ ఎన్వీఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు చిక్కం ప్రసాద్, గాలిదేవర రమేష్, పాయసం సాయి, తనూజ్ పాల్గొన్నారు.

మలికిపురం: మలికిపురం డిగ్రీ కళాశాల, విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాలల్లో బాలిక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. బాలికా సంరక్షణ మనందరి బాధ్యత, బాలికలను కాపాడుదామని నినాదాలు చేశారు. పీవీవీ ప్రసాద్, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.సతీష్, హెచ్ఎం శ్రీనివాసరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాలొన్నారు.

కపిలేశ్వరపురం: విద్యతోనే బాలికలు అన్నిరంగాల్లో ముందుకు సాగాలని శ్రమ కోఆర్డినేటర్ ఈశ్వరి అన్నారు. బుధవారం మాచర ఉన్నత పాఠశాల, కేదార్లంక ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆలమూరు శ్రమస్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు రమాదేవి, ఎం.ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన బాలికల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, శ్రమటీం, బాలికలు పాల్గొన్నారు.

పి.గన్నవరం: జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని పి.గన్నవరం హైస్కూల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మండలంలో పలు పాఠశాలల్లో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం డీవీఎస్ ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.వి.పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు కె.నాగలక్ష్మి, టి.పద్మ, జి.వి.ఎస్.కుమారి, జి.రామలక్ష్మి పాల్గొన్నారు.

మామిడికుదురు: జాతీయ బాలికల దినోత్సవాన్ని మామిడికుదురు దీప్తి స్కూలులో బుధవారం నిర్వహించారు. విద్యార్థినులు సేవ్ గర్ల్ నమూనాలో ఒదిగి ఆకట్టుకున్నారు. దీప్తి విద్యా సంస్థల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ, హెచ్ఎం వై.నాగన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశాలకు హాజరుకాని అధికారులకు మెమోలు ఇస్తాం

అంతర్వేది, జనవరి 24: సఖినేటిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లికార్జునరావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా రాపాక వరప్రసాదరావు విచ్చేసి మాట్లాడారు. నెలకోసారి జరిగే సర్వ సభ్య సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. హాజరుకాని అధికారులకు మెమోలు ఇస్తామని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం విద్యా, వైద్యం, తాగునీరు, రోడ్లు, భవనాలు, గృహనిర్మాణాలు తదితర అంశాలపై క్షేత్ర స్థాయిలో చర్చించారు. మోరి ఎంపీటీసీ సభ్యురాలు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన ఎమ్మెల్యే రాపాక వెటనరీ వైద్యాధికారి అందుబాటులో లేక పోవడం, మందులు ఇవ్వకపోవడంపై చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి చేసి చూపిస్తేనే ఎన్నికల్లో తిరిగి ప్రజాప్రతినిధులుగా గెలుస్తారన్నారు. ఒక పార్టీలో నెగ్గినా మరో పార్టీలో చేరినా నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. నాడు-నేడు పనులపై అంతర్వేది దేవస్థానం గ్రామంలో పరిశీలించాలని ఎంపీటీసీ సభ్యుడు బైరా నాగరాజు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బడుగు మంగాదేవి, వైస్ ఎంపీపీ రుద్రరాజు రాజా, కేఎస్ఎన్ రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని రద్దుచేయాలి

అమలాపురం టౌన్, జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 27/2023 చట్టాన్ని రద్దు చేయాలని డిమాండు చేస్తూ అమలాపురం కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన దీక్షలు బుధవారం 40వ రోజుకు చేరుకున్నాయి. ఆస్తులకు రక్షణలేని భూరక్షణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూపీ లక్ష్మణరావు, కార్యదర్శి దుర్గాబాబి, న్యాయవాదులు జీఎస్ నాయుడు, వీరిన సాయిరామ్, మహ్మద్ ఇక్బాల్, పర్వతం సూర్యప్రకాశరావు (చిట్టిబాబు) దీక్షలో పాల్గొన్నారు. ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వ కొలను తాతాజీ తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీ భావం తెలిపారు. భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని, భూ బకాసురుడు నశిం చాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రజలఆస్తుల రక్షణ కోసం న్యాయ వాదులు చేపట్టిన పోరాటానికి చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా వ్యాప్తంగా సంఘీభావం తెలుపుతుందని ప్రకటించారు. అవసరమైతే బంద్‌కు దిగుతామని హెచ్చరించారు.

వాయుసేనలో చేరండి

అమలాపురం టౌన్, జనవరి 24: భారత వాయుసేనలో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని వాయుసేన సార్జెంట్లు జీవన్‌సింగ్, అనిల్ పేర్కొన్నారు. భారత వాయుసేన విశిష్టతను వివరిస్తూ బుధవారం పట్టణ పరిధిలోని కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాయుసేన సికింద్రాబాద్ ప్రతినిధులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌ను వినియోగించుకుని వాయుసేనలో చేరవచ్చని సూచించారు. ఫిబ్రవరి 6వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్మీడియట్‌తోనే భారత్ వాయుసేనలో మంచి ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. ఎస్‌కేబీఆర్ కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ ఏవీ శర్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో చైతన్యం తీసుకువస్తున్న వాయుసేన సార్జెంట్లను డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, డీవైఈవో సత్యనా రాయణరెడ్డి, ఎంఈవో జి.సూర్యప్రకాశం తదితరులు అభినందించారు.

గ్యాస్ పైపులైన్ల మధ్యలో రైల్వేలైన్ ఏర్పాటుపై నిరసన

అమలాపురం రూరల్, జనవరి 24: కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ఏర్పాటులో భాగంగా కామనగరువులో చేపట్టిన స్థల సేకరణను బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థానిక దసరా బుల్లోడు మేజర్ డ్రెయిన్‌ను ఆనుకుని రైల్వేలైన్‌కు స్థలాన్ని సేకరించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. రెండు మేజర్ గ్యాస్ పైపులైన్ల మధ్యలో రైల్వేలైన్‌కు స్థలాన్ని ఎలా సేకరి స్తారని ప్రశ్నించారు. ఘటనా స్థలానికి తహసీల్దార్ పరమట శ్రీపల్లవి చేరుకుని రైతులతో పాటు స్థానిక నాయకులతో చర్చించారు. ఇప్పటికే అదే ప్రాంతంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి రైతులు స్థలాలు ఇచ్చిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఆ పక్కనే రైల్వేలైన్ ఏర్పాటు తగదన్నారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారులు, రైల్వేలైన్ అధికారుల దృష్టికి తీసుకువెళతామని తహసీల్దార్ తెలి పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజులపూడి భీముడు, నక్కా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను సక్రమ మార్గంలో నడిపించే శక్తి దైవజనులకు ఉంది

రావులపాలెం, జనవరి 24: ప్రజల కష్టసుఖాల్లో పాల్పంచుకుంటూ వారిని సక్రమ మార్గంలో నడిపించే శక్తి దైవజనులకు ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో బుధవారం క్రైస్తవ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బండారు మాట్లాడుతూ దైవజనులతో కలిసి సమావేశంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లపై టీడీపీ సీనియర్ నేతలు గుర్రు

రాజమహేంద్రవరంలో అంతర్గత సమావేశం

మండపేట, జనవరి 24: మండపేటలో ఈనెల20న జరిగిన రాకదలిరా బహిరంగసభలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మండపేట అభ్యర్థిగా ప్రకటించి, ఆయనను నాల్గవసారి గెలిపించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కోరారు. దీనిపై ఆ పార్టీ సీనియర్ నేతలు గుర్రుగా ఉన్నారు. ఎమ్మెల్యే వేగుళ్లకు వ్యతిరేకంగా బుధవారం టీడీపీ సీనియర్ నేత, విజయనగరం ఆర్టీసీ రీజియన్ మాజీ చైర్మన్ నెక్కంటి బాలకృష్ణ సారధ్యంలో రాజమహేంద్రవరంలోని షెల్టన్‌హోటల్‌లో నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేతలు సమావేశమయ్యారు. ఎమ్మెల్యే వేగుళ్ల ఎన్నికల సమయంలో మినహా తమను గుర్తించిన దాఖలాలులేవని సీనియర్లు ఆరోపిస్తున్నారు. మండపేట సీటును తాను ఆశిస్తున్నానని చంద్రబాబును కలిసి కోరినట్టు బాలకృష్ణ చెప్పారు. చంద్రబాబు నాయకత్వం, నిర్ణయంపై తాము వ్యతిరేకం కాదని, కేవలం మండపేట నియోజకవర్గంలో సీనియర్లకు జరుగుతున్న అన్యాయంపైనే ప్రశ్నిస్తున్నామన్నారు. త్వరలో చంద్రబాబును కలిసి నియోజకవర్గంలో పరిస్థితులు గురించి వివరిస్తామని బాలకృష్ణ చెబుతున్నారు. రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశంలో నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియస్ నేతలు, పార్టీ నేతలు, వల్లూరి వీర్రాజు పాల్గొన్నారు.

మామిడిగుంటలో అశ్లీల నృత్యాలు

ద్రాక్షారామ, జనవరి 24: రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు శివారు మామిడిగుంటలో మహాలక్ష్మమ్మవారి జాతరను పురస్కరించుకుని మంగళవారం రాత్రి అశ్లీల నృత్య ప్రదర్శన నిర్వహించినట్లు సోషల్ మీడియాలోవీడియోలు ప్రసారమయ్యాయి. ఈసంఘటనపై గ్రామంలో విచారణ జరపగా ఎంటువంటి నృత్య ప్రదర్శన జరగలేదని ప్రజలు చెప్పారని రామచంద్రపురం సీఐ పి.దొరరాజు తెలిపారు. అయితే ఈఘటనపై కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్ఐ సురేంద్ర తెలిపారు.

'ఆడుదాం... ఆంధ్రా' పోటీలు ప్రారంభం

కొత్తపేట, జనవరి 24: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఎంపీపీ మార్గన గంగాదరరావు, ముత్యాల వీరభద్రరావు, ఆర్డీవో ఎం.ముక్కంటి, ఎంపీడీవో ఈ.మహేశ్వరరావు, రెడ్డి చంటి, దంగేటి సుబ్రహ్మణ్యం, దూళి సూరిబాబు, సాగి బంగ్రారాజు, మట్టపర్తి సూర్యచంద్రరావు, ముసునూరి వెంకటేశ్వరరావు, సలాది బ్రహ్మాజీ పాల్గొన్నారు.

పాఠశాలకు మెగాఫోన్ బహూకరణ

కె.గంగవరం, జనవరి 24: కోటిపల్లి ప్రాథమిక పాఠశాలకు రూ.15వేలు విలువైన మెగాఫోన్‌ను పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న హర్షవర్ధన్ తల్లిదండ్రులు గాలి బాలాజీ, దుర్గా అందజేశారు.

కూళ్లలో ఉచిత పశువైద్య శిబిరం

కె.గంగవరం, జనవరి 24: కూళ్లలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. దీనిని సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు ప్రారంభించారు. పామర్రు పశువైద్యాధికారి ఎం.హిమబిందు ఆధ్వర్యంలో వైద్యుల బృందం 180పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. గర్భకోశవ్యాధులు, చూడిపరీక్షలు నిర్వహించారు. జిల్లా పశువైద్యశాఖ అధికారి కె.వెంకట్రావు శిబిరాన్ని పరిశీలించారు.

జగనన్న సురక్ష శిబిరం

ముమ్మిడివరం, జనవరి 24: ప్రజలంతా మంచి ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని కమిషనర్ జి.లోవరాజు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో స్థానిక 10,17,18వార్డుల ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, రెడ్డి శివన్నారాయణ, రామాయణం రాంబాబు, కర్రి శ్రీను, వైద్యులు యోగితాలక్ష్మి, మహేష్ కేజియా, టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రథానికి మరమ్మతులు

అంతర్వేది, జనవరి 24: మాఘమాసంలో ప్రారంభమయ్యే అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ గోపురాలకు రంగులు వేస్తూ ఆలయ ప్రధాన ఘట్టమైన రథాన్ని షెడ్డులో నుంచి బయటకు తీసి మరమ్మతులు చేస్తున్నట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రథం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారని, కల్యాణోత్సవాలకు, రథసప్తమి నాటికి రథాన్ని సిద్ధం చేస్తామన్నారు. ముందుగా రథానికి మరమ్మతులు చేపట్టి రంగులు వేయిస్తున్నట్టు తెలిపారు.

ఆసరా చెక్కులు పంపిణీ

అమలాపురంరూరల్, జనవరి24: పట్టణ పరిధిలోని 642డ్వాక్రా సంఘాల్లో 6,343మంది సభ్యులుండగా రూ.5.20కోట్లు చెక్కును మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం అందజేశారు. అనంతరం మండలస్థాయిలో 1,815డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కు రూ.16.33 కోట్లను అందజేశారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ పాల్గొన్నారు.

28న వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయవాల పంపిణీ

రాయవరం, జనవరి 24: లొల్ల గ్రామంలోని విశ్వమానవతాసంస్థ ఆధ్వర్యంలో వికలాంగులకు, బధిరులకు వినికిడి యంత్రాలు పంపిణీ, అవసరమైన వారికి కృత్రిమ అవయవాలు అమరుస్తామని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాస చౌదరి తెలిపారు. ఈనెల28వతేదీ ఆదివారం ఉదయం 9నుంచిమధ్యాహ్నం 2గంటల వరకు డాక్టర్ రఘునాథ్ (ఇంగ్లాండ్) నేతృత్వంలో ప్రత్యేక నిపుణుల బృందం బధిరులైన పిల్లలకు వినికిడి పరీక్షలు, హియరింగ్ ఎయిడ్స్, స్పీచ్ థెరపీ నిర్వహిస్తారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి విశ్వమానవత సంస్థ ద్వారాకృత్రిమంగా కాళ్లు,చేతులు అమరుస్తామన్నారు.వివరాలకు 9966673111,9966673283నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఏపీ సర్పంచ్‌ల చాంబర్ కార్యదర్శిగా సర్పంచ్ బాలరాజు



అంబాజీపేట, జనవరి 24: పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజును ఏపీ సర్పంచ్‌ల చాంబర్ కార్యదర్శిగా నియమిస్తూ ఏపీ సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు వైవీవీ బాబురాజేంద్రప్రసాద్, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వి.లక్ష్మీముత్యాలరావులు విజయవాడలోనియమాక ఉత్తర్వులు అందించారు. బాలరాజును పలువురు సర్పంచ్‌లు అభినందించారు.


ఆసరా చెక్కుల అందజేత

మండపేట, జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికిపెద్దపీట వేసిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చెప్పారు. ద్వారపూడిలో బుధవారం సర్పంచ్ ఈతకోట కిన్నెర అధ్యక్షతన రూ.1.69కోట్లఆసరా చెక్కును డ్వాక్రా మహిళలకు, 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్స్‌ను ఆయన అందించారు. కేశవరంలో ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ద్వారపూడిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వాసు, ద్వారపూడి ఉపసర్పంచ్ టి.శేషారావు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీను, రెడ్డి రాధాకృష్ణ, దూలం వెంకన్నబాబు, మాజీ జడ్పీటీసీ పోతుల రాంబాబు, పోతుల ప్రసాద్, ఇన్‌చార్జీ ఎంపీడీవో రాజు, తంతులూరి శ్రీరామచంద్రవర్మ, ఎంఎంసీ మాజీ చైర్మన్ తులా రంగరావు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెంలో బుధవారం నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కును ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అందజేశారు. వచ్చిన వారికి విందు ఏర్పాటు చేసి లక్కీ డిప్ ద్వారా బహుమతులు అందించారు.

కాట్రేనికోన: ఆసరా నాలుగో విడత కార్యక్రమం బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమీపంలో జరిగింది. మండలంలో 13,477మంది లబ్ధిదారులకు రూ.8,99,40,082ల చెక్కును ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యుడు సిద్ధవటం యానాదయ్య, నల్లా నరసింహమూర్తి, పాలెపు లక్ష్మీధర్మారావు, నేల కిశోర్‌కుమార్, నడింపల్లి సూర్యనారాయణరాజు(సూరిబాబు) పాల్గొన్నారు.

వైసీపీకి రాజీనామా



కాట్రేనికోన, జనవరి 24: మత్స్యకార వర్గానికి చెందిన వైసీపీ నాయకుడు పాలెపుధర్మారావు వైసీపీకిరాజీనామాచేశారు. ఆయన భార్య లక్ష్మి గతంలో జడ్పీటీసీగా పనిచేశారు. మరికొందరు వైసీపీకి రాజీనామా చేయనున్నట్టు ధర్మారావు తెలిపారు.

నేడు తాలూకా కేంద్రాల వద్ద పెన్షనర్ల ధర్నా

అమలాపురంటౌన్, జనవరి24: రాష్ట్రప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ దశలవారీ ఆందోళనలో భాగంగా గురువారం తాలూకా కేంద్రాల వద్ద ధర్నా నిర్వహిస్తామని జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పారుపూడి కృష్ణశాస్త్రి, కేకేవీ నాయుడు తెలిపారు. నాలుగున్నర ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకపోవడంతో ఆందోళనకు దిగుతున్నట్టు ప్రకటించారు. ఈనెల29నకలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడతామన్నారు. కోశాధికారి జేఎస్‌శర్మ, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సాయివర ప్రసాదరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్వీఎస్ఎస్‌సీహెచ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

షర్మిల పర్యటనను విజయవంతం చేయండి

కొత్తపేట, జనవరి 24: కాకినాడ సూర్యకళా మందిరంలో గురువారం జరిగే సమావేశానికి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరవుతారని, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు కోరారు. మండల శాఖ అధ్యక్షుడు పల్లి హరిశ్చంద్రప్రసాద్ అధ్య క్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు సంగిత సత్యనారాయణ, కప్పల రాంబాబు, సంసాని రామకృష్ణ పాల్గొన్నారు.

తాలూకా ఎస్ఐగా శేఖర్‌బాబు



అమలాపురం రూరల్, జనవరి 24: అమలాపురం తాలూకా ఎస్ఐగా యాళ్ల శేఖర్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ అందే పరదేశి బదిలీపై అంగర వెళ్లారు. శేఖర్‌బాబు విజయవాడ సిటీ టూటౌన్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

గణతంత్ర దినోత్సవానికి ఫైనల్ రిహార్సల్స్

యానాం, జనవరి 24: గణతంత్ర దినోత్సవం సందర్భంగా బుధవారం జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో పోలీసులు కవాతు ఫైనల్ రిహార్సల్స్ నిర్వహించారు. యానాం ఎస్పీ రఘునాయగం నేతృత్వంలో సీఐ షణ్ముగం నేతృత్వంలో పుదుచ్చేరి పోలీస్, ఇండియన్‌రిజర్వ్ బెటాలియన్, హోంగార్డ్స్, ఎన్‌సీసీ, వివిధ పాఠశాలల విద్యార్థులు కవాతులో పాల్గొన్నారు. ఈసందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల రిహార్సల్స్ ప్రదర్శనలు నిర్వహించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

రావులపాలెం, జనవరి 24: కొమరాజులంక గ్రామానికి చెందిన నల్లా శివరామాంజనేయులు(31) కనిపించట్లేదని ఆయన తండ్రి సత్యనారాయణ ఈనెల 15న రావులపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రావులపాలెం సెంట ర్‌లో పూల వ్యాపారం చేసుకునే రామాంజనేయులు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అన్ని ప్రాంతాల్లోను గాలించారు. కొంత అమాయకంగా ఉండే ఆ వ్యక్తి మృతదేహం అమలాపురం మండలం నడిపూడి లాకుల సమీపంలో తేలింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రావులపాలెం పోలీసులు తెలిపారు.

సర్పంచ్‌కు అవార్డు

అల్లవరం, జనవరి 24: రాష్ట్ర సర్పంచ్‌ల సమాఖ్య సభ్యుడు, యెంట్రుకోన సర్పంచ్ తిక్కిరెడ్డి నాగవెంకటశ్రీనివాసరావు ఆంధ్ర యువ సేవారత్న అవార్డును అందుకున్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, హ్యూమ న్‌రైట్స్ అసోసియేషన్ ఏపీ ఉపాధ్యక్షుడు రాయుడు శ్రీరామచంద్రమూర్తి సూచనతో శ్రీనివాసరావుకు హైకోర్టు న్యాయవాది ముషిణి రామకృష్ణారావు అవార్డు ప్రదానం చేశారు. సర్పంచ్‌కు మంత్రి పినిపే విశ్వరూప్, కరాటం ప్రవీణ్, సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు అభినందనలు తెలిపారు.

జగన్ మహిళా లోకాన్ని ఉద్ధరిస్తాడా: బండారు

కొత్తపేట, జనవరి 24: తల్లిని, చెల్లిని ఆదరించలేని సీఎం జగన్ రాష్ట్రంలో మహిళా లోకాన్ని ఉద్ధరిస్తాననడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతోమాట్లాడారు. రూ.2వేలకోట్లు అభయ నిధులను మళ్లించి మోసం చేశారన్నారు. నాయకులు ముత్యాల బాబ్జీ, రెడ్డి శ్రీను, నల్లా వెంకటరమణ, సిద్దాబత్తుల లక్ష్మణబహదూర్, జనుపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

రామచంద్రపురం, జనవరి 24: ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దొడ్డా సత్తిబాబు ఆధ్వర్యంలో ఎంఈవో మానుపూడి శ్రీనివాసరావు అపుస్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) క్యాలెండర్‌ను సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు.సెయింట్ ఎన్‌గ్లోరియా శ్రీకాంత్, గురుదేవ్ స్కూల్ గిరీష్ ప్రభు, నాగరాజు, వైష్ణవి స్కూల్ మల్లికార్జునరావు, సన్‌షైన్ శిరిగినీడి నందు, మోడరన్ రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం

అంబాజీపేట, జనవరి 24: ఏపీలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ రోజురోజుకు పెరుగుతుందని, త్వరలోనే ఆ పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. అంబాజీపేటలో ఏపీసీసీ జనరల్ సెక్రటరీ మాచవరపు శివన్నారాయణ ఇంటివద్ద నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ సమావేశం బుధవారం నియోజకవర్గ కన్వీనర్ వంటెద్దు బాబి అధ్యక్షతన జరిగింది. కాకినాడలో గురువారం జరిగే ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల నిర్వహించే పర్యటనను విజయవంతం చేయాలన్నారు. పీసీసీ ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మహ్మద్ ఆరీఫ్, నాయకులు యార్లగడ్డ రవీంద్ర, నెల్లి వెంకటరమణ, ములపర్తి మోహనరావు, ఆదుర్తి నారాయణమూర్తి, ముషిణి లక్ష్మణ్, అప్పన శ్రీరామకృష్ణ, వడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మామిడికుదురు, జనవరి 24: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు గ్రామానికి చెందిన మెండా సుజాత బుధవారం కడుపు నొప్పి తాళలేక ఇంట్లోని ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలివి. సుజాత భర్త వెంకటేశ్వరరావు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు ఉదయం బయటకు వెళ్లిన తరువాత ఆమె ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తర లించగా అప్పటికే మృతిచెందిందని డాక్టర్లు తెలిపారు. ఆమెకు నాలుగేళ్లు, ఏడాదిన్నర వయసు ఇద్దరు కుమా రులు ఉన్నారు. మృతురాలి తల్లి గంగిరెడ్డి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు నగరం ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: గుంటూరు కారం
వెంకటరమణ	: సైంధవ్
శ్రీలలిత	: గుంటూరు కారం
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: గుంటూరు కారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్